
కేసు వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, జూన్ 18: పద్మపాని సొసైటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్సీ నిర్వహణలో సఖీ కేంద్రంలో కేసు వర్కర్ పోస్టుని భర్తీ చేయుటకు అర్హత గల మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డైరెక్టర్ కే.సత్యనారాయణ తెలిపారు. మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. బ్యాచ్‌లర్ డిగ్రీ ఇన్‌లా/సోషల్‌వర్క్/సోషల్‌సైన్స్/సైకాలజీ ఉండాలని 3 సంవత్సరాల అనుభవం ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు 08468-223232, 7386276181 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.



అడుగంటుతున్న పోచారం ప్రాజెక్ట్



మద్నూర్‌లో ట్రాక్టర్‌తో దున్నుతున్న దృశ్యం



పెద్దకొడప్‌గల్‌లో సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

చినుకు.. జాడేది?

- జాడలేని నైరుతి రుతుపవనాలు
- జిల్లా వ్యాప్తంగా ఇంకా గరిష్ఠ స్థాయిలోనే ఉష్ణోగ్రతలు
- తడి లేక మొదలు కాని ఆరుతడి పంటల సాగు
- వర్షాభావ పరిస్థితులతో ముందుకు సాగని పంటల సాగు
- జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు
- దుక్కులు దున్ని వరుణుడి కోసం రైతుల ఎదురు చూపులు
- ఈ వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 5.14 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా

కామారెడ్డి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తొలకరి జాడలేదు. ఈనెల మొదటి వారంలోనే జిల్లాను నైరుతి రుతుపవనాలు తాకాల్సి ఉన్నా మూడో వారం పూర్తికావస్తున్నా ఆ ఛాయలే కానరావడం లేదు. మరోవైపు జిల్లా అంతటా గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఆరుతడి పంటల సాగుకు సన్నద్ధం అయిన రైతులు ఎదురుచూడక తప్పడం లేదు. జిల్లాలో గత మూడేళ్లలో ఈ సమయానికి వర్షాలతో ఆరుతడి, మెట్ట పంటల సాగు ఊపందుకుంది. కానీ ఈ ఏడాది ఈ పరిస్థితి లేకపోవడంతో ప్రధానంగా సోయా, పత్తి, మొక్కజొన్న, పప్పుదినుసు పంటల సాగుకు సిద్ధం చేసుకున్న రైతులు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం అన్ని పంటలు కలిపి 5.14 లక్షల ఎకరాలల్లో సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

5.14 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో వానాకాలం పంటల సాగుకు సంబంధించిన ప్రణాళికను వ్యవసాయశాఖ రూపొందించింది. గత సీజన్‌తో పోలిస్తే ఈ వానాకాలంలో కాస్తా సాగు విస్తీర్ణం తగ్గింది. గడిచిన వానాకాలం సీజన్‌లో 5.36 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా ఈ సీజన్‌లో 5.14 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశారు. ఈ లెక్కన ఈ సీజన్‌లో పంట సాగు విస్తీర్ణం కాస్తా పెరగనుంది. దీంతో వరి 3.13 లక్ష ల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా, మొక్కజొన్న 57,315 ఎకరాలు, పత్తి 28,730, సోయాబిన్ 85,444, కందులు 13,961, పెసర్లు 4,997, మినుములు 5,263, చెరుకు 2215, జొన్నలు 577 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేశారు.

వానల కోసం ఎదురు చూపులు

సాధారణంగా తొలకరి వర్షాలు కురిస్తే జూన్ మొదటి వారం నుంచే జిల్లాలో ఆరుతడి, మెట్టపంటల సాగు ఆరంభం అవుతోంది. కానీ ఈ ఏడాది మూడో వారం వరకు ఆ జాడలేకపోగా మరో వారం వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణంగా మే చివరి వారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేస్తారు. కానీ జూన్‌లో కూడా వర్షాలు లేక పత్తితో పాటు సోయా, పెసర, కంది, మొక్కజొన్న పంటల సాగు ఆలస్యం అవుతోంది. గత ఏడాది జూన్‌లో సగటున 79.4 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా ఈ సారి చినుకు కూడా లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 64.01 మి.మీ.ల వర్షపాతం మాత్రమే నమోదైంది

లోటు వర్షపాతం

వర్షాకాలం ప్రారంభమై జూన్ మాసం ముగుస్తున్నప్పటికీ పెద్దస్థాయిలో వర్షాలు లేవు. గత వారం రోజులుగా చినుకుజాడ కనిపించడం లేదు. జిల్లాలో ఇప్పటికీ లోటు వర్షాపాతమే నమోదైంది. గత ఏడాదిలో ఈ సమయానికి 79.4 మి.మీ. వర్షం కురువగా ఈసారి 64.01 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. బిచ్కుంద, తాడ్వాయి, రామారెడ్డి మండలాల్లో మినహాయిస్తే మిగితా 21 మండలాల్లో సాధారణం కంటే తక్కువే వర్షపాతం నమోదైంది.

సోయా, పత్తి పంటల పరేషాన్

జిల్లాలో జుక్కల్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, తాడ్వాయి, సదాశివనగర్, గాంధారి, రాజంపేట, రామారెడ్డి తదితర మండలాల్లో నీటి సౌలభ్యం లేకపోవడంతో వర్షాధార పంటలను సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతాల్లో వర్ష సూచన ఆధారంగా పొడి దుక్కుల్లోనే సోయా, మొక్కజొన్న, పత్తి, కందులు, మినుములు లాంటి విత్తనాలను నాటుతారు. ప్రస్తుతం అలాంటి సూచనలు ఏమి లేకపోవడంతో దుక్కులు దున్నిన విత్తనాలను నాటడానికి రైతులు సాహసించడం లేదు. గత ఏడాది మే చివరి వారం, జూన్ మొదటి వారంలో వర్షాలు కురువడంతో జూన్ మూడో వారానికి కల్లా జిల్లాలో ఆరుతడి, మెట్ట పంటల విత్తనాలు వేశారు. ఈ సారి కూడా సోయా, పత్తి, మొక్కజొన్న, పప్పు దినుసు పంటలను ఎక్కువగానే సాగు చేస్తారని అంచనా వేస్తే వర్షాలు లేక ఈ పంటల విత్తనాలను రైతులు విత్తడం లేదు.

అంతర్ జిల్లా రెండు వరుసల రహదారి హుళక్కేనా?



రెండు వరుసల రోడ్డుకు ప్రతిపాదన చేసిన నిజాంసాగర్ ప్రాజెక్టు రోడ్డు

- ఏడేళ్లు గడిచినా ఫలితం శూన్యమే
- ప్రతిపాదనలకే పరిమితం
- ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగేనా?
- రూ.35 కోట్ల ప్రతిపాదనలకు నిధులు మంజూరయ్యేనా?
- అధ్వానంగా అంతర్ రాష్ట్ర నిజాంసాగర్ రహదారి

నిజాంసాగర్, జూన్ 18: నిజాంసాగర్ నుంచి సంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లి 161 రహదారి ప్రతిపాదనలకే పరిమితమైనది. ఏడేళ్ల క్రితం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. సంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లి ఎన్‌హెచ్‌ఏ నుంచి సంగారెడ్డి జిల్లా వరకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేదు. సుమారు 12 కిలో మీటర్లున్న రహదారి నిజాంసాగర్ ప్రాజెక్టు మీదుగా ఈ రహదారిని రెండు వరుసల రహదారిగా మారిస్తే ఎంతో అనువుగా ఉంటుందని ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిజాంసాగర్ కట్ట వెడల్పుతో పాటు వంతెన నిర్మాణం కూడా చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించారు. ఏడేళ్లు గడుస్తున్నా నిధుల మంజూరుకు నోచుకోలేదు. ప్రస్తుతం నిజాంసాగర్ మండల కేంద్రం నుంచి అంతర్ జిల్లా సరిహద్దు వరకు రెండు వరుసలకు నిధులు మంజూరు అయ్యేనా అని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ నుంచి నిజాంసాగర్ వరకు వెళ్లే వారికి తక్కువ వ్యవధిలో నిజాంసాగర్ ఉంటుందని భావించారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ నిజాంసాగర్ ప్రాజెక్టు మీదుగా అంతర్ జిల్లా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలున్నాయి. పదేళ్ల తర్వాత ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరవుతాయని భావిస్తున్నారు. ప్రాజెక్టు రాష్ట్ర రహదారిలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నా నిజాంసాగర్ పర్యాటక, ప్రాచీన కట్టడాలు కనుమరుగైన విషయం పాఠకులకు విధితమే. నైజాం కలలు సాకారం చేస్తామన్న తెలంగాణ ప్రభుత్వం అతిథి గృహాలు, గార్డెన్లు, గుల్‌గస్తే రహదారి, అంతర్ జిల్లా రహదారిని కేవలం మరమ్మతులు చేశారు. కానీ అంతర్ జిల్లా రహదారిపై కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా నైజాం కాలంలో నిర్మించిన ప్రాజెక్టుపై నుంచి రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ప్రత్యేక రహదారితో పాటు ప్రాచీన కట్టడాలు, పర్యాటక స్థలాలను తీర్చిదిద్దాలని ఉభయ జిల్లాల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు

రామారెడ్డి, జూన్ 18: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాల భైరవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య భైరవునికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నాం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, ఆలయ అధికారి సురేందర్‌గుప్తా, పురోహితులు మనీష్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు నిర్వహించిన భక్తులు

స్టూడెంట్ బస్ పాసులు ఎప్పుడిస్తారు?

- బస్‌పాసులు ఇవ్వాలని విద్యార్థుల వేడుకోలు
- ఆరు రోజులు గడిచినా పాసుల కోసం అప్రూవల్ ఇవ్వని ఆర్టీసీ
- 10కిలో మీటర్ల దూరానికి రాను పోను రూ. 80 టికెట్టా?
- ఇది ఉభయ జిల్లాలోని ఆర్టీసీ తీరు

నిజాంసాగర్, జూన్ 18: 2023-24 ఆర్థిక సంవత్సరం పాఠశాలలు ఈ నెల 12వ తేదీన ప్రారంభమయ్యాయి. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల పర్వం కొనసాగుతోంది. ఉభయ జిల్లాల్లో పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి పై తరగతులకు వెళ్లిన విద్యార్థులు తరగతులు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం బస్ పాసుల కోసం ఇప్పటికీ అప్రూవల్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు అనేక పాట్లు పడుతున్నారు. ఉభయ జిల్లాలోని మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాలలకు వచ్చి విద్యాభ్యాసం చేస్తున్నారు. బస్ పాసులకు ఆయా విద్యాలయాల ప్రధానాచార్యులు బోనఫైడ్‌లు జారీ చేశారు. బోనాఫైడ్ పాస్‌పోర్టులతో మీ సేవలో దరఖాస్తులు చేసుకోవడానికి ఆదేశాలిచ్చారు. విద్యార్థులు బస్‌పాసుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను విద్యాలయాల్లో అప్రూవల్ ఇవ్వాల్సి ఉండగా, మీ సేవలో ఆర్టీసీ సైట్‌లో అందుబాటులో లేకపోవడంతో బస్‌పాసుల కోసం పాట్లు పడుతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులో విద్యార్థులు ప్రయాణించాలంటే రాను పోను రూ.80 చెల్లించాల్సి వస్తోంది. మహిళలకు ఇప్పటికే ప్రభుత్వం ఫ్రీ టికెట్ ప్రాతిపదికన ప్రయాణిస్తుండగా, టికెట్ వసూలు చేయడం లేదు. కేవలం విద్యార్థులకు మాత్రమే బస్సుల్లో ప్రయాణిస్తున్నా టికెట్ రుసుం వసూలు చేస్తున్నారు. ఉభయ జిల్లాలో విద్యాభ్యాసం చేసే వారికి బస్‌పాసులు జారీ చేయకపోవడంతో ప్రతిరోజూ ఒక్కొక్క విద్యార్థి రూ.80 చెల్లించి ప్రయాణిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై 7 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆర్టీసీ బస్‌పాస్‌లను జారీ చేయకపోవడం గమనార్హం. జిల్లాలోని ఆదర్శ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వందలాది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. బస్ పాసులు జారీ కాకపోవడం పట్ల పాఠశాలల్లో హాజరు శాతం తగ్గడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బస్ పాస్‌ల జారీని పునఃరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు

నులిపేద్దాం

- పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై నులి పురుగుల ప్రభావం
- జిల్లావ్యాప్తంగా 2,50,254 మంది పిల్లలకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ
- రేపు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

కామారెడ్డి టౌన్, జూన్ 18: మానవ జీవన ప్రక్రియలో పేగుల పాత్ర ఎంతో కీలకం. తిన్న ఆహారం సరిగా జీర్ణమైతేనే అన్ని ప్రక్రియలు సరిగా సాగుతాయి. మొదటి సంవత్సరం దాటినప్పటి నుంచి పిల్లలు బయట ఆహారం తీసుకోవడంతో నులి పురుగుల సమస్య మొదలవుతోంది. పెద్ద పేగుల్లో ఇవి తిష్టవేసి, పిల్లల ఎదుగుదలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తుంటాయి. 1 నుంచి 19 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న పిల్లలపై వీటి ప్రభావం అధికంగా ఉంటుంది. వీరిలో ముఖ్యంగా రక్తహీనత ఏర్పడుతోంది. శారీరక ఎదుగుదల లోపిస్తోంది. మానసిక రుగ్మతలు దశలవారీగా కనిపిస్తాయి. పైకి లక్షణాలు పెద్దగా కనిపించకపోయినా ఎప్పుడు నలతగా ఉంటారు. త్వరగా అలసిపోతూ చదువు, ఆటలు, ఇతర అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉంటారు. పిల్లల ఎదుగుదలకు పెద్ద అవరోధంగా తయారైన నులి పురుగులను అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 ఫిబ్రవరిలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రకటించి 19 ఏళ్లలోపు పిల్లలకు ఏడాదిలో రెండు సార్లు నులిపురుగుల నివారణ మాత్రలను మింగించాలని నిర్ణయించింది. ప్రతీ సంవత్సరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తూ పిల్లల్లో అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగుల వ్యాప్తిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

నులి పురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. వారిలోని పోషకాహార స్థితిని బలహీనపరిచి, వాళ్లను బలహీనులుగా తయారు చేస్తాయి. శరీరంలో ఇనుము, ప్రోటీన్లను నష్టపరిచి తరచూ రక్తహీనత కలుగజేస్తాయి. శరీరానికి అందాల్సిన పోషకాలను పీల్చేసి వాటిని గ్రహించే శక్తిని తగ్గిస్తాయి. దీంతో పాటు విటమిన్-ఏను కూడా హరించేస్తాయి. కొన్ని నులిపురుగులు పిల్లల్లో ఆకలి మందగించడానికి, శారీరక దృఢత్వాన్ని తగ్గించడానికి చూస్తాయి. అందువల్ల చాలా మంది పిల్లలు బక్కగా మంద బుద్ధి వారిగా కనిపిస్తారు. ఇవి కడుపులో ఉన్న పిల్లలు అనేక రుగ్మతలతో బాధపడుతారు. రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, అతిసార, మలంలో రక్తం రావడం వంటి రోగాల బారిన పడుతుంటారు. ఈ వ్యాధులన్నింటిని ఒక్క మాత్రతో నివారించేందుకు జిల్లాలో 1-19 లోపు వయస్సు గల వారికి అల్బెండాజోల్ మాత్రలను వేయాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్ణయిం చారు.

అపరిశుభ్రతే కారణం

పిల్లల్లో ఈ రకమైన పురుగులు చేరడానికి కారణం అపరిశుభ్రతే. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లలకు నులిపురుగులు సమస్య ఎక్కువగా ఉంటుంది. పిల్లలు ఎప్పుడు చేతి గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లు పెరిగిన వెంటనే కత్తిరించుకోవాలి. వాటిల్లో పేరుకున్న మట్టి ద్వారా నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వల్ల కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరుతాయి. కూరగాయలను కడగకపోవడం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవడం వల్ల కూడా నులిపురుగుల ప్రభావం ఉంటుంది. వీటిని నిర్మూలించేందుకు అల్బెండాజోల్ మాత్రలను తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి.



మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం

- చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో

అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. నులి పురుగుల నివారణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. తల్లిదండ్రులు పిల్లల్లో నులిపురుగుల వ్యాప్తి చాలా ప్రమాదకరమని తెలుసుకోవాలి. ఇవి పైకి కనిపించకుండానే ఎన్నో రుగ్మతలకు కారణం అవుతాయి పిల్లలు త్వరగా అలసిపోవడం, ఏకాగ్రత సరిగా ఉండకపోవడం, శారీరక ఎదుగుదల ఉండదు. కావున ఈ పరిస్థితి నుంచి పిల్లలను గట్టెక్కించేందుకు తప్పకుండా నులిపురుగుల మాత్ర వేయాలి. ఈనెల 20 నుంచి 27 వరకు మాత్రల పంపిణీ ఉంటుందని తెలిపారు.

2,50,254 మంది పిల్లల లక్ష్యం

జిల్లాలో నులిపురుగుల వ్యాధులను నివారించేందుకు 1-19 సంవత్సరాల పిల్లలకు ఖచ్చితంగా అల్బెండాజోల్ మాత్రలను వేయాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్యశాఖ ముందుకు సాగుతోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1-5 సంవత్సరాలు గల 1,193 అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు, 6-19 సంవత్సరాలు గల 1252 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మొత్తం 2,50,254 మంది పిల్లలకు మాత్రలు అందించనున్నారు.

తిమ్మక్‌పల్లిలో వృద్ధురాలి హత్య

కామారెడ్డిటౌన్, జూన్ 18: కామారెడ్డి మండలంలోని తిమ్మక్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి రాగుల లక్ష్మి(70) హత్య జరిగినట్లు దేవునిపల్లి ఎస్‌ఐ రాజు తెలిపారు. తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన రాగుల రాజశేఖర్ అనే వ్యక్తి తన తండ్రిని కొడుతుండగా రాజశేఖర్ ఇంటిపక్కనే ఉన్న రాగుల లక్ష్మి అటు వైపుగా వెళ్తుండగా రాజశేఖర్ పాతకక్షలతో ఆమె కాళ్ల మీద దాడి చేయడంతో ఆమె కిందపడింది. దీంతో ఆమె ఎడమచెవి కణతపై ఇటుకలతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఆమెను వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడి నుంచి ఆమెను తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కొడుకు రాగులపెద్దనర్సింలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

అత్తను చంపిన కోడలుకు రిమాండ్

బిచ్కుంద, జూన్ 18:మండలంలోని బండరెంజల్ గ్రామానికి చెందిన దోబ్బబాలవ్వ(65) అనే మహిళ ఈనెల 14న హత్యకు గురైందని ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. దోబ్బబాలవ్వకు, ఆమె కోడలు దోబ్బ అంజవ్వకు వడ్ల అమ్మకం ద్వారా వచ్చిన రూ.48 వేల డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో బాలవ్వ గొంతును అంజవ్వ గట్టిగా నొక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త విట్టబోయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతుండగా బాలవ్వ చనిపోవడంతో భయపడి అంజవ్వ అక్కడినుంచి పారిపోయిందని ఎస్‌ఐ తెలిపారు. మంగళవారం అంజవ్వ వచ్చిపోలీసుస్టేషన్‌లో లొంగిపోగా ఆమెను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

బీబీపేట, జూన్ 18:బీబీపేట మండలంలోని జనగామ గ్రామశివారులో బైక్ అదుపు తప్పి దోర్నాల రాజయ్య(45) మృతిచెందినట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.దోమకొండ మండలం అంచనూర్ గ్రామానికి చెందిన రాజయ్య ద్విచక్రవాహనంపై మల్కాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా జనగామ గ్రామశివారులో వాహనం అదుపుతప్పి క్రిందపడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్‌ఐ వివరించారు.

ప్రజలకు ఆరోగ్యసిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలి

రామారెడ్డి, జూన్ 18:ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్యసిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని రామారెడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. రామారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

హైలెవల్ బ్రిడ్జిలో నాణ్యత లోపాలు

● ఏడాది గడవక ముందే బ్రిడ్జికి ఇరువైపులా కోతకు గురైన సైడ్ మొరం ● వాహనదారులకు తప్పని తిప్పలు ● పట్టించుకోని అధికారులు



మనోహరాబాద్, పడకల్, కలిగోట్ గ్రామాల మధ్య నిర్మించిన బ్రిడ్జి



బ్రిడ్జిపై సిమెంట్ కొట్టుకుపోయి కంకర తేలిన దృశ్యం



కురిసిన వర్షాలకు బ్రిడ్జికి ఇరువైపుల కోతకు గురైన దృశ్యం

జక్రాన్‌పల్లి,జూన్ 18: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రభుత్వం కోట్ల నిధులు వెచ్చించి రోడ్లు, బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయినప్పటికీ ఏడాది గడవక ముందే చెడిపోతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్, పడకల్, కలిగోట్ గ్రామాల మధ్య సుమారు రూ.3కోట్ల 95లక్షలతో హైలెవల్ బ్రిడ్జిని నిర్మించారు. ఏడాది గడవక ముందే ఈ బ్రిడ్జిలో లోపాలు ఎత్తిచూపుతున్నాయి. 28 సెప్టెంబరు 2023న అప్పటి నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఈ బ్రిడ్జిని ప్రారంభోత్సవం చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కూడా రూ.3కోట్ల 95 లక్షల నిధులు మంజూరు చేయించారు. గత ఏడాది, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జికి ఇరువైపులా మట్టి మొరం కొట్టుకుపోయి భారీగా కోతకు గురైంది.ఒక సైడ్‌కు సిమెంట్ రాళ్ల తెట్టె కొట్టుకు పోయింది. బ్రిడ్జిపై సిమెంట్ కొట్టుకుపోయి కంకరతేలి దీంతో బ్రిడ్జివద్దకు రాగానే ఇరువైపుల వెళ్లే వాహనదారులు కంకర తేలడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం అయినందున భారీ వర్షాలు కురిస్తే బ్రిడ్జికి ఇరువైపులా సైడ్‌లకు మొరం కొట్టుకుపోయి. బీటీరోడ్డు అంచు కోతకు అరయ్యే అస్కారం ఉంది.ఈబ్రిడ్జి నిర్మించి ప్రారంభోత్సవం చేసి ఏడాదిగడవక ముందే పనుల్లో . నాణ్యత లోపాలు ఎత్తిచూపడంతో అధికారుల పర్యవేక్షణ కరువైం దని దీంతో ఈబ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపాలు ఏర్పడు తున్నా యని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం,సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపుల కొట్టుకు పోయిన సిమెంట్ రాళ్ల తెట్టేను, అలాగే ఇరువైపుల కొట్టుకుపోగా కోతకు గురై ప్రాంతంలో మళ్లీ మొరం పనులు చేయించాలని,బ్రిడ్జిపై కొట్టుకు పోయిన సిమెంట్ కొట్టుకుపోయి తేలిన కంకర ప్రాంతంలో పనులను చేయి ంచాలని,అలాగేఈబ్రిడ్జిచిన్న పనులుచేయించాలనిప్రజలు కోరుతున్నారు.

చెడిపోయిన వాటి పనుల మరమ్మతులు చేయిస్తాం

మండలంలోని మనోహరాబాద్, పడకల్, కలిగోట్ గ్రామాల మధ్య నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశాం. ఈ బ్రిడ్జి పనుల్లో కొన్ని పనులు మిగిలిపోయాయి. మిగతా పనుల కోసం రూ.40లక్షల నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన సిమెంట్ రాళ్ల తెట్టేను బ్రిడ్జిపై తేలిన కంకర మరమ్మత్తు పనులను, బ్రిడ్జికి ఇరువైపుల మొరం కొట్టుకుపోయి కోతకు గురైన ప్రాంతంలో మొరం పనులను చేయిస్తాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేయిస్తాం.

- ప్రవీన్, ఆర్అండ్‌బీ ఏఈఈ, జక్రాన్‌పల్లి

జాతీయ రగ్బీ పోటీలకు సిరికొండ విద్యార్థి ఎంపిక

సిరికొండ జూన్ 18: ఈ నెల 25 నుంచి 26 వరకు పూనేలో జరిగే జాతీయ రగ్బీ క్రీడల పోటీలకు సిరికొండ హైస్కూల్ విద్యార్థి బాదవత్ ఆకాష్ ఎంపికయినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు అబ్బన్న తెలిపారు. పూనేలోని చత్రపతి శివాజీ స్పోర్ట్స్ మైదానంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ క్రీడల పోటీలకు జిల్లా జట్టుకు ఆకాష్ ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. ఆకాష్‌ను మంగళవారం ప్రాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్ సునిత, పాల్గొన్నారు.

ద్వితీయ శ్రేణి నాయకులంటే పోచారానికి చులకన భావం

● కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దని పార్టీ నాయకుల డిమాండ్



పోతంగల్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,జూన్18: అధికారమే పరమావధిగా భావించి ద్వితీయశ్రేణి నాయకులను ఎదగనివ్వకపోగా వారిపట్ల చులకన భావంతో వ్యవహరించే మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారనే ప్రచారంతో ఆందోళన చెందుతున్న కాంగ్రెస్ నాయకులు మంగళవారం పోతంగల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ శంకర్ మాట్లాడుతూ పోచారం 40ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి వచ్చి రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవులు అనుభవించారన్నారు. రాజకీయంగా తన కుటుంబం ఎదగాలే తప్ప మరెవరు ఎదగకుండా ఉండేలా నియోజకవర్గాన్ని తన చెప్పు చేతల్లో పెట్టుకున్నారని ఆరోపించారు. తన ఆస్తులను, పదవులను కాపాడుకోవడంతో పాటు తన కుటుంబ సభ్యులకే ఉన్నత పదువులు ఇప్పించుకోవడంలో ఎమ్మెల్యే పోచారం గిట్ట అని ఆరోపించారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో నియోజకవర్గం నుంచి ఓఎమ్మెల్సీ పదవి, జిల్లాస్థాయి పదవులను ద్వితీయ శ్రేణి నాయకులకు ఇప్పించే ప్రయత్నం చేయలేదన్నారు. ప్రతిపక్ష నాయకులను తన అధికార బలంతో ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. వారిపై కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురి చేశారని వాపోయారు. పోచారం ఎన్ని ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పని చేశామన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో పోచారంను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తే తమ రాజకీయ భవిష్యత్ అంధకారం అవుతుందని ఆవే దన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పోచారంను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పవన్, ఎంపీటీసీవీరేశం, నాయకులు రాంరెడ్డి, హన్మంతు, వలీయొద్దీన్,. మన్సూర్, అహ్మద్ పాల్గొన్నారు.

పార్క్‌ఫెన్సింగ్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 18: వినాయక్‌నగర్‌లోగల గణేష్‌నగర్ పార్క్ ఫెన్సింగ్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వినాయక్‌నగర్ గణేష్‌నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు బలరాం, జనరల్ సెక్రెటరీ మహిపాల్‌రెడ్డి, ట్రెజరర్ రాజేశ్వర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బావ గొంతు కోసిన బావమరిది

● కుటుంబ కలహాలే కారణం ● కేసునమోదు



గాయపడ్డ నీలస్వామి

లింగంపేట, జూన్ 18 : లింగంపేట మండలంలోని మెంగారం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి బంధువుతో కలిసి సొంత బావ గొంతు కోసిన బావమరిది. వివరాలు ఇలా ఉన్నాయి.. కోమట్ పల్లి గ్రామానికి చెందిన సునితను బోనాల్ గ్రామానికి చెందిన నీల స్వామికి ఇచ్చి కొన్ని సంవత్స రాల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంసారం విషయంలో భార్యభర్తలు గొడవ పడ్డారు. 8నెలల క్రితం సునిత భర్తను వదిలి పిల్లలను తీసుకుని తల్లిగారింటికి వెళ్లింది. చెల్లెలును భావ స్వామి ఇబ్బందులు పెడుతున్నాడని ఆవేశా నికి గురైన భావమరిది నవీన్ భావ స్వామి పై పగ పెంచుకున్నాడు. నవీన్ తమ సమీప బంధువు నాగిరెడ్డిపేట మండలం జప్తి జానకంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌తో కలిసి సొంత భావను హత్య చేయాలని ప్లాన్ వేశాడు.ఈక్రమంలో సోమవారం రాత్రి మెంగారంగ్రామంలో కల్లు దుకాణంలో నవీన్, సుధాకర్, నీల స్వామిలు కలిసి కల్లు తాగారు అనంతరం కోమట్‌పల్లి గ్రామానికి వెళ్లేందు కు బయలు దేరారు. మెంగారం బస్టాండ్ వద్దకు రాగానే నవీన్, సుధాకర్‌లు ఒక్కసా రిగా నీల స్వామిపై కత్తులతో దాడి చేసి గొంతుకోషారని వారి నుంచి తప్పించుకుని గ్రామంలోకి పరుగుపెట్టగా నవీన్, సుధాకర్‌లు పారిపోయారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్సై ప్రకాశ్ గ్రామానికి చెరుకుని తీవ్రంగా గాయపడ్డ స్వామిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. బాధితుడి తల్లి నీల అల్లెవ్వ పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలి

ఆర్మూర్‌రూరల్, జూన్18: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ గ్రూప్‌లలో అడ్మిషన్‌లు తీసుకుంటున్నామని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సిహెచ్.నర్సయ్య ఒక ప్రకటనలో కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, వీవోసీ, సీటీ గ్రూప్‌లలో తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం విభాగాల్లో అడ్మి షన్‌లు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభ వజ్ఞులైన అధ్యాపకులచే అత్యుత్తమ విద్యబోధన అందజేస్తున్నా మన్నా రు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వారికి బాలురు, బాలికలకు వేర్వేరు హాస్టల్ వసతి, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, ఉచిత బస్‌పాస్ సౌకర్యంతో పాటు ఎన్ఎస్ఎస్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, క్రీడల్లో విద్యార్థు లను ప్రొత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణు లైన విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోనే చేరాలని ప్రిన్సిపాల్ కోరారు.

జాతీయ రహదారిపై వాహనాల దారి మళ్లింపు

డిచ్‌పల్లి,జూలై 18: మండల కేంద్రంలో మంగళవారం ఎస్సై మహేశ్ ఆధ్వ ర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల దారి మళ్లింపు కార్యక్రమా న్ని ఏర్పాటు చేశారు. నిజామాబాద్-డిచ్‌పల్లి రహదారి నుంచి తెలంగాణ విశ్వవిద్యాలయంకు వెళ్లే వాహనాలు ఒకే రోడ్డుపై వెళ్లుండటంతో రోడ్డు ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో చాలా వాహనాలు తిరిగి వెళ్లక తప్పలేదు.

ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని రోడ్డు

● అనునిత్యం ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన ఏర్గట్ల నుంచి మెట్‌పల్లికి వెళ్లే రోడ్డు

ఏర్గట్ల, జూన్ 18: మండలం కేంద్రంలోని జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి వెళ్ళే రోడ్డు ఏళ్ళు గడుస్తున్నా మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. తేలికపాటి వర్షానికే రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణీలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత రెండు మూడు రోజులు క్రితం కురిసిన తెలికపాటి వర్షానికే రోడ్డు బురదమయంగా మారడంతో ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అనునిత్యం వాహనధారులు ప్రమాధాలకు గురవుతున్నా సంబంధిత అధికారుల తీరు మాత్రం మారడం లేదు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనధారులు రోడ్డుపై వెళ్ళాలంటే జంకుతున్నారు. ఇట్టి విషయమై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అట్టి అంశాన్ని లేవనెత్తినప్పటికీ ఆర్అండ్‌బి అధికారులు స్పందించక పోగారోడ్డు మరమ్మత్తులక నోచుకోవడం లేదు. వర్షాకాలం దృష్ట్యా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డిచ్‌పల్లిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ఎంపీపీ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,జూన్ 18:మండల పరిషత్ కార్యాలయంలో పలుగ్రామాలకు చెందిన గ్రామీణ ప్రజల నుంచి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దర ఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎంపీడీవో రవీందర్, ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేయించారు. ఇటీవల ప్రజాపాలన లో ప్రభుత్వం ప్రకటించిన 6గ్యా రంటీల పథకాలను అర్హులైన లబ్దిదారులు మరోసారి ధరఖాస్తు చేసుకోవ చ్చు అని ఎంపీడీవో తెలిపారు. గ్రామీణ ప్రజలు దరఖాస్తులు ఇచ్చేందుకు మండల కార్యాలయానికి బారులు తీరారు. ఉచిత విద్యుత్, 500రూ.గ్యాస్ సిలిండర్,ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజలు పోటీపడ్డారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

రుద్రూరు, జూన్ 18 : రుద్రూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం లో మంగళవారం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లతో సమీ క్షా సమావేశాన్ని ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ రిజిష్టర్లను అప్‌డేట్ చేయాలని, ఉద్యానవన, పామ్‌ఫాండ్స్ కోసం భూమిని గుర్తించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంపీవో సాయిలు, ఈజీఎస్ ఏపీవో మనోహర్, టెక్నికల్ అసిస్టెంట్ ప్ర సాద్, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



బోధన్ ఆర్డీవోతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

బోధన్‌రూరల్,జూన్18: గరువారం నులి పురుగుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని బోధన్ డివిజన్‌లో 96,263మంది 19ఏళ్ల లోపు చిన్నారులు ఉన్నారని నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. బోదన్ డివిజన్‌లో 96,263మంది చిన్నారులు, విద్యార్థులు ఉన్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, సూపరిండెంట్ డాక్టర్ సమతలతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఈ టాబ్లెట్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మొఐదలుకుని కాలేజీల వరకు ఈ మాత్రలు ఇవ్వడం జరుగుతుందని ఒక సంవత్సరం నుండి 2సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్ ఆపై వారికి ఫుల్ టాబ్లెట్ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డిని కలిశారు. కార్యక్రమం విజయవంతం కోసం ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నిర్మల, కిరణ్, సంబంధిత వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఘన్‌పూర్‌లో ఇంటింటా సర్వే

డిచ్‌పల్లి,జూన్ 18:మండలంలోని ఘన్‌పూర్‌లో మిష న్ భగీరథ కుళాయిల వివ రాలను గ్రామ కార్యదర్శి సు నీల్ ఆధ్వర్యంలో మంగళ వారం ఇంటింట సర్వే చేశారు. 100లీటర్ల నీళ్లు వస్తున్న యో లేవో అనే విషయం తెలుసుకునేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నమని ప్రతీఒక్కరు అధికారులకు సహక రించలన్నారు.

గేటు దాటుతుండగా రైలు ఢీకొని కూలీ మృతి



మృతదేహన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

నవీపేట,జూన్18: మండలంలోని ఫకీరాబాద్ రైల్వే గేటు సమీపంలో గేటు దాటుతుండగా బర్లకాడి సాయిలు(47)అనే కూలీ మృతి చెందారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జాన్, స్థానికులు తెలిపిన ప్రకారం ఎడపల్లి మండలం రాణాకలాన్‌కు చెందిన నలుగురు కూలీలు రెంజల్ మండలం తాడ్‌బిలోలిలో ఇల్లు కప్పడానికి ఆదివారం వెళ్లారు. సోమవారం రాత్రి వరకు పని చేసి తన స్వగ్రామానికి వెళ్లడానికి కాలి నడకన ఫకీరాబాద్ వచ్చారు. మూసి ఉన్న గేటు నుండి ముగ్గురు దాటగా వెనుక వచ్చిన సాయిలు గేటు దాటుతుండగా సోమవారం అర్ధరాత్రి నాగర్‌సోల్ నుండి నర్సాపూర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అల్బెండజోల్ మాత్రలపై అవగాహన

డొంకేశ్వర్, జూన్ 18: డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడి టీచర్‌లకు అల్బెండజోల్ మాత్రలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 19ఏళ్ళలోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ సురేందర్, ప్రమీల అన్నారు. ఈ మాత్రలు పంపిణీ చేసినట్లయితే పిల్లల్లో రక్తహీనత పెరిగి ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఆశకార్యకర్తలు, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.



వర్షాలు కురువాలని బతుకమ్మ ఆటలు ఆడుతున్న దృశ్యం

వర్షాల కోసం బతుకమ్మ ఆటలు

తాడ్వాయి, జూన్ 18: మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో మంగళవారం వర్షాల కోసం మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. బతుకమ్మ పాటలు పాడుతూ వర్షాలు కురువాలని భగవంతున్ని ప్రార్థించారు. వర్షాలు కురవకపోవడంతో వేసుకున్న విత్తనాలు మొలకెత్తడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భగవంతుని కరుణించి వర్షాలు కురిసేలా దీవించాలని కోరారు. గ్రామంలో ఒకరిపై ఒకరు నీళ్లు పోసుకుంటూ ఆటలు ఆడారు. స్థానిక రాజరా జేశ్వర స్వామి, హనుమాన్ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

గాంధారి, జూన్ 18: పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం ఎంతో ఖర్చు పెడుతుందని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్‌కు దీటుగా విద్యా బోధన చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

గాంధారి, జూన్ 18: మండలంలో మిషన్ భగీరథ తాగునీటి నల్ల కనెక్షన్లపై ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు తాగునీటి కుళాయిలపై సర్వేను చేపట్టారు. మండల కేంద్రంలో ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో మిషన్‌భగీరథకు చెందిన తాగునీటి వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, అరుణ్‌కుమార్, ఓంకార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశం

నసురుల్లాబాద్, జూన్ 18:మండల కేంద్రంలో బుధవారం మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని నసురుల్లాబాద్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పార్టీ అనుబంధ సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు మండల పరిధిలోని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ఈ ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని మండల అధ్యక్షులు విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

బీర్కూర్, జూన్ 18: మండలంలోని అన్నారం గ్రామ పంచాయతీ భవనంలో మంగళవారం గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీవో భారతి అధ్యక్షతన గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఆమె వెంట గ్రామ కార్యదర్శి మోహన్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), జూన్ 18: జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్‌ను మహ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం నారాయణ ఖేడ్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జహీరాబాద్ పార్లమెంట్ సభ్యునిగా భారీ మెజార్టీతో గెలిచిన సురేష్ శెట్కార్‌ను కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగభూషణంగౌడ్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లయ్యగారి ఆకాష్, గంగి రమేష్, సిద్ధి రామిరెడ్డి, తోట రాజు, సాయాగౌడ్, మహిపాల్ తదితరులున్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

బీర్కూర్, జూన్ 18: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భసంచి, రొమ్ము క్యాన్సర్, గొంతు క్యాన్సర్ తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు స్వామి, ప్రీతి, సూపర్ వైజర్లు నర్సమ్మ, సుశీల తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని వినతి

భిక్కనూరు, జూన్ 18: భిక్కనూరు పట్టణంలోని పాత హరిజనవాడలో ప్రజల సౌకర్యార్థం రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు, బీఆర్‌ఎస్ నాయకులు భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత హరిజనవాడలోని 15,16 వార్డుల్లోని ప్రజలు గత చాలా రోజులుగా ప్రతీనెలా రేషన్ తీసుకోవడానికి కిలో మీటరున్నర దూరం వెళ్లాల్సి వస్తుందని, దీంతో ప్రతినెలా కాలనీ ప్రజలందరం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పని చేయని నిఘా నేత్రాలు

- మరమ్మతు చేయించిన కొన్ని రోజులకే పని చేయని కెమెరాలు

బాన్సువాడ, జూన్ 18: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు గత కొన్ని నెలల నుంచి పని చేయకపోవడంతో పట్టణంలో జరిగిన సంఘటనలు కాని, దొంగతనాలు కాని ప్రమాదాలు కాని నిఘా నేత్రాలలో రికార్డు కాకపోవడంతో పోలీసులకు తల నొప్పులుగా మారాయి. అంతేకాకుండా పట్టనంలో ప్రతి వార్డుల్లో ప్రధాన రహదారిపై బస్టాండ్ ప్రాంతంలో నిఘా నేత్రాలు ఉన్నప్పటికీ అవి పని చేయకపోవడంతో పట్టణంలో జరిగే ప్రతి సంఘటన హత్యలు బైకు దొంగతనాల పాల్పడిన నిందితులను పట్టుకోవడంలో విఫలంతో పాటు ఆలస్యంగా లభ్యం కావడంతో పోలీసులు తర్జనభర్జన అవుతున్నారు. గత నెలలో బాన్సువాడ పట్టణంలోని వారంతపు సంతలో అక్క తమ్ముడు హత్యలు ఇతర మహిళల హత్యలు బైకు దొంగతనాలు చోరీల నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిఘా నేత్రాలలో పొందు కాకపోవడంతో తలలు పట్టుకున్నారు. ఇదిలా ఉంటే రాత్రి వేళలో పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా అక్రమ రవాణా వంటి వాహనాలను గుర్తించడంలో కూడా ఆలసత్వం నెల కొనడం జరిగింది. బాన్సువాడ పట్టణంలో మొత్తం 108 సీసీ కెమెరాలు ఉండగా కేవలం ఎనిమిది మత్రమే పని చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే మరో వైపు నిఘా నేత్రాలను మరమ్మతులు చేసిన కొన్ని రోజులకే పని చేయకపోవడం మరో సమస్య నెలకొంది. గతంలో జరిగిన ప్రమాదాలు కాని చోరీలు గాని ఇతర వ్యాపారస్తుల దుకాణాల సీసీ కెమెరాలు ద్వారా గుర్తించి ప్రమాదాలకు పాల్పడిన నిందితులను పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. మారుమూల వార్డుల్లో రాత్రివేళల జరుగుతున్న సంఘటనలు రికార్డు కాకపోవడంతో ఇతర వ్యక్తుల ద్వారా సమాచారం తెలుసుకుని ప్రమాదాలకు చోరీలకు హత్యలకు గల నిందితులను పట్టుకోవడం జరుగుతోంది. అంతేకాకుండా అనుమానంగా ఉన్న వ్యక్తుల ఫోన్లో ద్వారా నింవదితులను పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా బాన్సువాడ పట్టణంలో 108 నిఘా నేత్రాలను వెంటనే మరమ్మతులు చేయించి పట్టణంలో జరుగుతున్న ప్రమాదాలు, హత్యలు, చోరీలను అరికట్టే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసులకు తలనొప్పిగా మారిన దొంగతనాలు

బాన్సువాడ పట్టణంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రమాదాలు హత్యలు చోరీలకు గల సంఘటనలు పూర్తిస్థాయిలో లభ్యం కాకపోవడంతో నిఘా నేత్రాలు మరోక వైపు పని చేయకపోవడంతో పోలీసులకు తలనొప్పిగా మారిందని చెప్పుకోవచ్చు. అంతేకాకుండా నిందితులను పట్టుకోవడంలో కూడా పోలీసులకు ఆలస్యం తర్జనభర్జన జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో నెలకొన్న నిఘా నేత్రాలను మరమ్మతు చేయిస్తే పూర్తి సమాచారం వెంటనే పోలీసులకు లభించే అక్రమ రవాణాతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునేలా అవకాశం ఉంటుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.



బాన్సువాడలోని ప్రధాన రహదారులపై పని చేయని సీసీ కెమెరాలు

108 సీసీ కెమెరాలు ఉన్నా పని చేయని వైనం..

బాన్సువాడ పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు వార్డుల్లో ఇతర సమస్య కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పూర్తిగా పని చేయకపోవడంతో ప్రమాదాలను అరికట్టడంలో విఫలమవుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. బాన్సువాడ పట్టణంలో మొత్తం 108 సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ ఏ ఒక్క సీసీ కెమెరా పని చేయకపోవడం గమనార్హం. ఇంత పెద్ద మున్సిపాలిటీ పరిధిలో నిఘా నేత్రాలు పని చేయకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం పాత బాన్సువాడల్లో 8 సీసీ కెమెరాలు మరమ్మతులు చేసిన ప్పటికీ ఇతరత్రా సమస్యల ద్వారా అవి కూడా పని చేయడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు మరమ్మతులు చేయించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే మరమ్మతు చేయిస్తాం : టౌన్ సీఐ

బాన్సువాడ పట్టణంలోని 108 నిఘా నేత్రాలను త్వరలోనే మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకువస్తామని బాన్సువాడ పట్టణ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. నిఘా నేత్రాలు పని చేయడం లేదనేది వాస్తవమేనని గత కొన్ని రోజుల క్రితం పాత బాన్సువాడలో ఎనిమిది సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించినా కేబుల్ వైర్లు తెగిపోవడంతో పని చేయడం లేదన్నారు. మిగతా అన్ని కూడా త్వరలోనే మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు. ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

ధర్మాన్ని రక్షించండి.. మిమ్మల్ని ధర్మం రక్షిస్తుంది

- జగద్గురు నరేంద్ర చార్య మహరాజ్

మద్నూర్, జూన్ 18: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని రక్షించాలని, అది మిమ్మల్ని కాపాడుతుందని జగద్గురు నరేంద్ర ఆచార్య మహరాజ్ అన్నారు. జుక్కల్ నియోజకవర్గం బంగారు పల్లిలో ఉన్నటువంటి తెలంగాణ ఉప పీఠానికి వచ్చిన జగద్గురు భక్తులకు మార్గదర్శనం చేశారు. వారి సమస్యలు విని పరిష్కారాన్ని చూపించారు. ప్రతి మనిషి ధర్మం పట్ల కట్టుదిట్టంగా ఉండి ధర్మాన్ని రక్షిస్తూ భక్తి మార్గంలో నడుచుకోవాలని అన్నారు. మనం ఏది ఆశించకుండా నిష్కామంగా చేసే సేవల వలన సత్య కర్మ ఫలితం వస్తుందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరిలో దైవభక్తితో పాటు దేశ భక్తి ఉండాలని అప్పుడే ఈ దేశాన్ని పరాయిలా నుంచి కాపాడుకోగలుగుతామని అన్నారు. తాగుడుకు బానిసైన వారికి ప్రత్యేక మార్గదర్శన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జగద్గురు నరేంద్ర ఆచార్య మహారాజ్‌ను దర్శించుకోవడానికి మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణలోని ఆయా జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. రెండు రోజుల పాటు వేలాది మంది భక్త స్వామిజీని దర్శించుకున్నారు. వారి కోసం నిర్వాహకులు అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉండటానికి వసతులను ఏర్పాటు చేశారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న జగద్గురు, హాజరైన భక్తులు

'ఎమ్మెల్యే పోచారం రాకను అడ్డుకుంటాం'

బీర్కూర్, జూన్ 18: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే ఆయన రాకను అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బస్వరాజ్ పటేల్, విండో ఛైర్మన్ కమలార్ రెడ్డిలు మాట్లాడారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గత పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా, స్పీకర్‌గా పదవులు అనుభవించారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పత్రికల్లో కథనాలు ప్రచుఇతం అవుతున్నాయని, అయితే ఆయన చేరికను తాము ముక్త కంఠంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత పదేళ్ళుగా కష్టనష్టాలను ఓర్చి కాంగ్రెస్ పార్టీలో కొనసాగామన్నారు. కేసులు, దాడులను ఎదుర్కొంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేశామన్నారు. తీరా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అధికారం లేకుండా పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉండలేకపోతున్నారని నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి కృష్ణారావుల దృష్టికి తీసుకెళ్లి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాకను అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు సానెపు గంగారాం, యామ రాములు, అబ్దుల్ అహ్మద్, ఇక్బాల్, రాచప్ప, బెల్కోని గంగారాం, పోగు నారాయణ, హైమద్, బండ సాయిలు, అసిఫ్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కుమార్తెపై అత్యాచారం.. కేసు పెట్టాడని తండ్రిపై పగ

- బెయిల్‌పై వచ్చి.. వృద్ధుడిపై యువకుల హత్యాయత్నం
- తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

నాగిరెడ్డిపేట, జూన్ 18 : దివ్యాంగురాలైన కుమార్తెపై గతంలో నలుగురు యువకులు అత్యాచారం చేయగా.. తండ్రి ఫిర్యాదుతో వారంతా జైలుకు వెళ్లారు. ఇటీవలే బెయిల్‌పై విడుదలైన నిందితుల్లో ఇద్దరు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై కోపంతో గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నాగిరెడ్డిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన 18ఏళ్ల దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు రెండేళ్ల క్రితం అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించారు. అయితే నిందితులుగా ఉన్న నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు రమేష్, శ్యామ్‌లు ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చారు. తమపై పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న పాత కక్షతో దివ్యాంగురాలి తండ్రిపై కోపం పెంచుకున్నారు. అతన్ని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారు. అదును కోసం వేచి చూడసాగారు. అయితే బాధితురాలి తండ్రి గత సోమవారం రాత్రి కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. దీన్ని గమనించిన రమేష్, శ్యామ్‌లు తమ స్నేహితుడైన సాయిలు సహాయంతో వృద్ధుడిపై వెనుక వైపు నుంచి ఒక్కసారిగా దాడి చేశారు. కత్తితో దాడి చేసి.. గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించారు. వృద్ధుడు చనిపోయాడని అనుకొని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉంది. కాగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు రమేష్, శ్యామ్, సాయిలుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డి పేట ఎస్సై రాజు తెలిపారు.

నులి పురుగుల నివారణ లక్ష్యం

మద్నూర్, జూన్ 18 : నులి పురుగుల నివారణ కోసం ఉమ్మడి మద్నూర్ మండలంలో ఈనెల 20 నుంచి అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రీలేఖ సూచించారు. నులి పురుగుల నివారణ లక్ష్యంగా చిన్నారులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. నులి పురుగుల వ్యాధుల నివారణ కోసం ప్రతీయేట వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వ్యాధులను నివారించడానికి ఈనెల 20, 27 రెండు రోజులు అన్ని పాఠశాలల్లో ఇంటింటికీ అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించి మాత్రలు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో ఆశలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది పాల్గొని మాత్రలు పంపిణీ చేయనున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్, ఆరోగ్య కేంద్రాల్లో మాత్రలు అందుబాటులో ఉంటాయని ఆమె సూచించారు.



డోంగ్లీ పీహెచ్‌లో వర్కర్లు, అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు

యూపీఎస్సీ సివిల్స్‌కు ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్

కామారెడ్డి రూరల్, జూన్ 18: యూపీఎస్సీ సివిల్స్‌కు ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సి.హెచ్.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక సివిల్ సర్వీసెస్‌కు లాంగ్‌టర్మ్ పరీక్ష 2025 కోచింగ్ తరగతులు 18 జూలై 2024 నుంచి 18 ఏప్రిల్ 2025 వరకు టీ.జీ.బీ.సీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, హైదరాబాద్‌లో ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా అందులో 100 మందిని 07 జూలై 2024 తేదీన నిర్వహించే ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మిగితా వివరాలకు 08462-241055 కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా..

- తృటిలో తప్పిన ప్రమాదం
- తీవ్ర గాయాలతో బయటపడ్డ డ్రైవర్

నసురుల్లాబాద్, జూన్ 18: మండలంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం అదుపు తప్పి లారీ బోల్తా పడ్డ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపేట్ నుంచి బోధన్‌కు వెళుతున్న బియ్యం లోడ్ లారీ డ్రైవర్ అతివేగం వల్ల బోల్తా కొట్టిందని తెలిపారు. తృటిలో ప్రమాదం తప్పిందని, తీవ్ర గాయాలతో డ్రైవర్ బయటపడటం జరిగిందన్నారు. ఈ విషయమై పోలీసులకు వివరణ కోరగా ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. కాగా అతివేగంతో వాహనాలు బాన్సువాడ - నిజామాబాద్ ప్రధాన రహదారిపై దూసుకెళుతున్నాయని అడవి ప్రాంతంలో పోలీసులు సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవు అని స్థానికులు అన్నారు.

వానాకాలం సాగులో అధికారుల సూచనలు పాటించాలి

- డీఏవో భాగ్యలక్ష్మీ

భిక్కనూరు, జూన్ 18: వానాకాలం పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మీ అన్నారు. మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమాన్ని భిక్కనూరు రైతువేదికలో రైతులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ సాగులో రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని, విత్తనాలు, ఎరువుల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలన్నారు. విత్తనాలను ప్రభుత్వ గుర్తింపు ఉన్న డీలరు వద్దనే కొనుగోలు చేయాలని, వాటికి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. సాగుకు సంబంధిచి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రాధ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

బీసీజీ వాక్సినేషన్ విజయవంతానికి కృషి చేయాలి

భిక్కనూరు, జూన్ 18: టీబీ వ్యాధి రాకుండా ప్రభుత్వం చేపట్టనున్న అడల్ట్ బీసీజీ వాక్సినేషన్‌తో పాటుగా ఈ నెల 20న చేపట్టనున్న అల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎన్ఎంలు విజయవంతం చేయాలని భిక్కనూరు మండల వైద్యాధికారిణి యేమిమా సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఈ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందుకు లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న 19సంవత్సరాల లోపు పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలను వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విత్తనాల షాప్‌లో అధికారుల తనిఖీలు

బీర్కూర్, జూన్ 18: మండల కేంద్రంలోని విత్తన విక్రయ షాపుల్లో మంగళవారం టాస్క్‌ఫోర్సు అధికారులు తనిఖీలు చేపట్టారు. విత్తనాల బస్తాలను, శాంపిళ్లను పరిశీలించారు. అలాగే షాప్ లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, సేల్ రిజిష్టర్, బిల్ బుక్‌లు, రైతు వారి అందించిన విత్తనాలు తదితర రిజిష్టర్లను తనిఖీ చేశారు. నాసిరకం, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్సు అధికారులు బిచ్కుంద ఏడీఏ ప్రసన్న లక్ష్మీ, ఏవోలు రాజలింగం, రాజు, కమల తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

మద్నూర్, జూన్ 18: మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాగప్ప గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ తరఫున 50 లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్‌లో పాలసీ తీసుకున్న మృతుడు నాగప్ప మార్చి 11న మృతి చెందగా కుటుంబ సభ్యులకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ తరఫున 50 లక్షలు చెక్కును అందజేసినట్లు డివిజనల్ మేనేజర్ అభినందన్ జాదవ్ తెలిపారు. ఆయనతో పాటు అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, లైఫ్ మిత్ర సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

దోమకొండ, జూన్ 18: మండలం సంగమేశ్వర్ గ్రామంలో తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన అక్కడున్న బంధువులను, గ్రామస్థులను కంటతడి పెట్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సడుగు నరేందర్(45) గత పది రోజుల క్రితం బతుకుదెరువు నిమిత్తం గుజరాత్ రాష్ట్రానికి వెళ్లి జీవనం సాగి స్తున్నాడు. అక్కడ గత సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా.. మంగళవారం మృతదేహాన్ని స్వగ్రామమైన సంగమేశ్వర్‌కు తీసుకు వచ్చారు. మృతుడికి భార్య జ్యోతి, కూతురు దివ్య ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో కూతురే తల కొరివి పెట్టింది. ఈ సంఘటన అందరినీ కలిచివేసింది.

బయట నిద్రిస్తున్న వృద్ధుడిపై వీధి కుక్కల దాడి

- ముక్కు, చేతిపై గాయాలు
- మల్లుపల్లిలో ఘటన

భిక్కనూరు, జూన్ 18: కరెంట్ పోవడంతో తెల్లవారుజామున ఇంటి బయట అరుగుపై నిద్రిస్తున్న వృద్ధుడిపై వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన భిక్కనూరు మండలంలోని మల్లుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చన్న మదర్ అనే వృద్ధుడు తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో కరెంట్ పోవడంతో ఇంటిలో నుంచి బయటకు వచ్చి అరుగు పైన నిద్రించాడు. అదే సమయంలో వృద్ధుడిపై ఒక్కసారిగా వీధికుక్కలు దాడిచేసి ముక్కు, చేతిపై తీవ్రంగా గాయపరిచాయి. దీంతో భయాందోళనకు గురైనా మదర్ కేకలు వేయడంతో కాలనీవాసులు, కుటుంబ సభ్యు లు కుక్కలను అతడిని కాపాడి స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి సలహా మేరకు కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామంలో వీధికుక్కల బెడద చాలా ఉందని, ఇటీవల గ్రామానికి చెందిన కొందరి మేక, గొర్రెలను సైతం చంపివేశాయని, పలువురిని గాయపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వీధికుక్కల బెడదను తగ్గించాలని వేడుకుంటున్నారు.



వృద్ధుడి ముక్కు, చేతిపై గాయపరిచిన కుక్కలు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	ఓసీ	మహేశ్వరి	మనమే
దర్శన్	మహారాజ	వెంకటేశ్వర	గం గం గణేశా
ప్రియా 70	మనమే		
ప్రియా 35	హరోంహర		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

